నేడు కొత్తగూడెంకు మంత్రి తుమ్మల

కొత్తగూడెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి చుంచుపల్లి మండలం నందాతండా నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ, రాందాస్‌తండా, బంజారాకాలనీ మీదుగా వికలాంగుల కాలనీ వరకు రూ. 1.50కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.4కోట్లతో నిర్మించిన నూతన జిల్లా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.


ఖమ్మం వెలుగుమట్లలో కమ్మ వన సమారాధనలో మంత్రి తుమ్మల


వైరా మండలంలోని కొల్లివారి మామిడి తోటలో కమ్మవారి వనసమారాధనలో సామూహిక భోజనాల దృశ్యం

వనమంతా సందడి

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక వన సమారాధనలు
- గుబాళించిన కార్తీకమాసం సంస్కృతీ సంప్రదాయాలు
- పలు కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, సామూహిక భోజనాలు, ఆటాపాటలు
- తరలివచ్చిన ఆయా సామాజిక వర్గాల నేతలు
- కులాల చరిత్ర, గొప్పతనంపై జోరుగా ప్రసంగాలు
- ఐక్యంగా ముందుసాగి అభివృద్ధి చెందాలని పిలుపు
- హాజరైన మంత్రులు, నాయకులు

ఖమ్మం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపు సమీపిస్తున్న తరుణంలో జనమంతా వనం బాట పట్టారు.. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ తోటలు, పార్కులన్నీ జనాలతో కళకళలాడాయి. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాలకు ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు, బంధువులతో వనాల్లోనే సందడిగా గడిపారు. వనసమారాధనల్లో భాగంగా ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఆయా సంఘాల నిర్వాహకులు ఆ తర్వాత ఆటపాటలు, విందు భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన ఆయా సామాజికవర్గాల నేతలు, ప్రతినిధులు తమ కులాల చరిత్రను, గొప్పతనాన్ని ఆసక్తిగా వివరించారు. ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.

ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్‌పార్కులో కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన నిర్వహించిన వన సమారాధన మహోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం నగర ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో చెరుకూరి వారి మామిడితోటలో జరిగిన వన సమారాధనలో మంత్రులు తుమ్మల, పొంగులేటితోపాటు సంఘం నేతలు పాల్గొన్నారు. గొల్లకురుమల వనసమారాధనలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అఖిలభారత జిల్లా యాదవ మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఇక బల్లేపల్లిలో జగన్ మామిడితోటలో జరిగిన మెల్లమాంబ కుమ్మరసంఘం ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, రఘునాథపాలెంలోని ఎస్ఎన్ మూర్తి మామిడితోటలో బంజరా ఉద్యోగుల నిర్వహించిన వనసమారాధన కార్యక్రమంలో పొంగులేటి, రఘురాంరెడ్డి పాల్గొన్నారు. వైరా కమ్మ జనసేవాసమితి ఆధ్వర్యంలో సోమవరం గ్రామ సమీపంలోని కొల్లివారి మామిడి తోటలో నిర్వహించిన కార్తీకమాస వనసమారాధనలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు.

సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్‌పార్క్‌లో ఆదివారం నిర్వహించిన కమ్మ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సత్తుపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాణీ గురుకులం, పట్టణ గౌడసంఘం ఆధ్వర్యంలో కందిమళ్ల కృష్ణారావు మామిడితోటలో కౌండన్య కార్తీక వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు (మిగతా 6వ పేజీలో)

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



- ఉమ్మడి జిల్లాలో ఎయిర్ పోర్టు నిర్మాణం
- ఆదర్శంగా వెలుగుమట్ల అర్బన్‌పార్క్ అభివృద్ధి
- 'సీతారామ'తో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- కమ్మ వన సమారాధనలో మంత్రి తుమ్మల

6

గుబాళించిన కార్తీక సౌరభం

6

ఆత్మీయ పలకరింతలు.. విందూ వినోదాలు



కష్టకాలంలో ఆర్యవైశ్యుల సహకారం గొప్పది

- సముచిత స్థానాన్ని కల్పించడంలో ముందుంటా..
- కార్తీక వన సమారాధనలో మంత్రులు పొంగులేటి, తుమ్మల

7



ఐక్యతతోనే రాజ్యాధికారం దక్కుతుంది..

- కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా యాదవ సామాజిక వర్గం
- వన సమారాధనలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

7



ప్రజలకు మేలు చేసినప్పుడే గుర్తుంచుకుంటారు..

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా
- లక్ష్మీదేవిపల్లిలో ఘనంగా మున్నూరుకాపుల వనసమారాధన

7

ఎర్ర జెండా నీడలో ఎదిగి..




నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

- మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కన్నుమూత
- జీవిత పర్యంతం ప్రజాసేవలో తరించిన నేత
- మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నిక
- సీపీఐ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో అనుబంధం
- ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు
- బయ్యారం ఇనుప ఖనిజం రక్షణకు ఉద్యమం
- విషాదంలో అభిమానులు.. నేడు హన్మంతులపాడులో అంత్యక్రియలు

ఇల్లెందు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజాభిమానాన్ని చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య(74) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. ఇల్లెందు మండలం హన్మంతులపాడు గ్రామానికి చెందిన అబ్బయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సింగరేణి కార్మికుడిగా ఉద్యోగం చేస్తూనే సీపీఐలో నాయకుడిగా ఎదిగిన అబ్బయ్య రాజకీయ ప్రస్థానం జీవిత చరమాంకంలో అనేక ఒడిదుడుకులతో సాగింది.

ఆదివాసి గిరిజన కుటుంబానికి చెందిన ఆయన తండ్రి నాగయ్య సుదిమళ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఐ నాయకుడిగా ఎదిగిన అబ్బయ్య పార్టీలో పలు కీలక పదవులు నిర్వహించారు. ఇల్లెందు నియోజకవర్గంలో నక్సలైట్ పార్టీలను దీటుగా ఎదుర్కొంటూ పార్టీ విస్తరణకు కృషి చేశారు. నక్సలైట్ దళాలకు దీటుగా పార్టీని, క్యాడర్‌ను కాపాడుకోవడానికి అనేక రకాల శక్తియుక్తులతో సాగిన అబ్బయ్యపై ఆయుధాల చట్టం పరిధిలో కేసులు కూడా నమోదయ్యాయి. ఆయన శక్తియుక్తులు గుర్తించిన సీపీఐ నాయకత్వం తొలుత నేటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు నియోజకర్గం నుంచి 1983లో ఎమ్మెల్యేగా గెలిపించుకుంది. అనంతరం 1994లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఆయన సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి ఎంఎల్ పార్టీపై గెలుపొందారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే టీడీపీ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరారు. ఆ పిదప జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఇల్లెందు నియోజకవర్గం నుంచి టికెట్ ఇచ్చినప్పటికీ దురదృష్టవశాత్తు ఆయన బీ ఫారం పోగొట్టుకొని స్వతంత్ర (మిగతా 6వ పేజీలో)

నేడు అంత్యక్రియలు..

అబ్బయ్య అంత్యక్రియలు సోమవారం హన్మంతులపాడు గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అబ్బయ్య మృతదేహం హైదరాబాద్ నుంచి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకుంది. ఆయన మృతదేహాన్ని చూడగానే అభిమానులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆయన చేసిన త్యాగాలను, కార్యకర్తలను కాపాడుకోవటానికి చూపించిన తెగువను స్మరించుకుంటూ నివాళులర్పించారు.


వేములూరులో మెగా హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్


బైక్‌పై వెళ్తున్న ఎస్పీ

అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు...

- యువత సన్మార్గంలో నడిచి ఉన్నతస్థాయికి చేరాలి
- గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి
- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్
- వేములూరులో మెగా వైద్య శిబిరం
- బైక్‌పై వెళ్లి మనుబోతులగూడెంలో సమస్యల పరిశీలన

6

రాజ్యాంగ పరిరక్షణకు నడుం కట్టాలి..


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కే.నాగేశ్వర్

- అందుకు ఈ సమావేశాల నుంచే బీజం పడాలి
- భారత రాజ్యాంగం మతోన్మాదానికి వ్యతిరేకం
- దేశంలో ఆర్థిక అసమానతలు రూపు మాపాలి
- మత విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాడాలి
- ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్
- ఘనంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ చెప్పినట్లు రాజ్యం, మతం ఒక్కటి కాదని, సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోందని ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బీజాలు వేయాలన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్ ఏచూరి ప్రాంగణంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ 'ఎస్ఎఫ్ఐ స్టూడెంట్ ఈజ్ ఏ కంప్లీట్ స్టూడెంట్' అని నమ్మితే మనం ఎక్కడున్నా ఎస్ఎఫ్ఐ విలువలతో నడుచుకునే అవకాశం లభిస్తుందన్నారు. సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ నేర్పిందన్నారు. మరో రెండు రోజుల్లో రాజ్యాంగ స్వర్ణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం ఓ చరిత్రాత్మకతను సంతరించుకుందన్నారు.

ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం తెలుగునాట రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి బీజాలు వేయాలన్నారు. రాజ్యాంగ విలువలపై ఎందుకు ఉద్యమం జరగకూడదని నాగేశ్వర్ ప్రశ్నించారు. మతాన్ని విద్వేషంగా వాడుతున్న వారితో గతంలో ఎలా పోరాడామో ఇప్పుడు కూడా ఆ మత విద్వేషాలకు వ్యతిరేకంగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అంకురార్పణ కావాలన్నారు. భారత రాజ్యాంగం మతానికి వ్యతిరేకం కాదని, మతోన్మాదానికి మాత్రమే వ్యతిరేకమన్నారు. రాజ్యాంగ పరమైన ఆలోచనలు కల్పించడానికి ఈ సమ్మేళనం దోహదపడితే చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

నాడు ఎస్ఎఫ్ఐ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదాన్ని ఇచ్చిన రోజు దాని లోతు తెలియకపోవచ్చు కానీ ప్రస్తుత సమాజంలో దాని ఆవశ్యకత ఏంటో బోధపడుతోందన్నారు. ఎస్ఎఫ్ ఉద్యమ సమయంలో (మిగతా 6వ పేజీలో)


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సర్వే డేటా ఎంట్రీ కీలకం

- డోర్ లాక్, వలస వెళ్లిన వారి వివరాలు ఫోన్‌ద్వారా సేకరించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని, ఈ సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్లతో (మిగతా 6వ పేజీలో)

నేడు 'కార్తీక' చివరి సోమవారం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో శివాలయాలను సందర్శించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరమ పవిత్రం శివునికి అత్యంత ప్రీతికరం.. కనుకనే ఈనెలలో శివ పూజలు ఆచరించేందుకు భక్తులు అధిక ప్రాధాన్యమిస్తారు.. ఆలయాల్లో నదుల వద్ద నూనె దీపాలను వెలిగించే సంప్రదాయం ఉండటంతో, 365 వత్తులను వెలిగించే సంప్రదాయాన్ని భక్తులు పాటిస్తారు.

ఖమ్మంలో నేడు కోటి దీపోత్సవం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సోమవారం సాయంత్రం 6గంటలకు సారధినగర్ ఎంబీ గార్డెన్స్ పక్కనగల మహాచక్రపీఠం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు శివాలయ అర్చకులు సత్తెనపల్లి ఉమామహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు 360 వత్తులు నూనె, ప్రమిదలను తామే ఉచితంగా సమకూరుస్తామని లక్ష వత్తులు వెలిగించాలనుకునే భక్తులు రూ.150 చెల్లిస్తేచాలన్నారు. కోటి దీపోత్సవం వద్ద సేవలు చేసేందుకు ఆసక్తిగల భక్తులు సోమవారం ఉదయాన్నే ఆలయంలో సంప్రదించాలని కోరారు.

రంగస్థలానికి పూర్వ వైభవం దక్కాలి: కలెక్టర్



వనం కృష్ణవేణికి పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగస్థలానికి పూర్వ వైభవం దక్కాలని అందుకు ప్రేక్షకులు తమవంతు సహకరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు.. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన నెలనెలా వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ఎంతో విశిష్టత కలిగి ఉన్నదని చెప్పారు. ఇంతటి మంచి జిల్లాలో పనిచేసే అవకాశం దక్కటం తన అదృష్టం అన్నారు. రంగస్థల నాటకరంగాన్ని బతికించేందుకు స్థానికంగా కళా సాంస్కృతిక సంస్థలు పనిచేయటం అభినందనీయం అన్నారు. కళలు వర్ధిల్లాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కళలు సమాజాన్ని సన్మార్గంలో నడిపేందుకు ఉపకరిస్తాయన్నారు. ఈ సందర్భంగా నాగబత్తిని మాలతి స్మారకంగా పేద కళాకారులకు చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మంచి పనికి పూనుకున్న నిర్వాహకులను అభినందించారు. నాగబత్తిని మాలతి స్మారక పురస్కారాన్ని ప్రముఖ కళాకారిణి, రాజకీయ, న్యాయ ప్రముఖురాలు వనం కృష్ణవేణికి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల హెచ్‌పీ మేనేజర్ సమ్మయ్య, పెట్రో సీనియర్ డీలర్ కోన జనార్దన్‌రావు, పెట్రోలియం రాష్ట్ర నాయకులు మోతుకూరి గోపాలరావు, జిల్లా పెట్రోడీలర్స్ అధ్యక్షుడు ఈశ్వరప్రగడ రంగనాథ్, నెలనెలా వెన్నెల నిర్వాహకులు ఏఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహనరావు, కళాపరిషత్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, ప్రజా నాట్యమండలి బాధ్యులు కె.దేవేంద్ర, వేముల సదానంద్, తదితరులు పాల్గొన్నారు. నాటికకు ముందుగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు శాస్త్రీయ నృత్యాలను అభినయించారు.

అలరించిన నాటిక

ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'చిగురు మేఘం' నాటిక ప్రేక్షకులను అలరించింది.. అమరావతి ఆర్ట్స్ గుంటూరు కళాకారులు ప్రదర్శించిన నాటికలో నటీనటులు తమ హావభావాలతో సన్నివేశాలను రక్తి కట్టించారు. బంధాలు అనుబంధాల విలువ తెలిపే ఇతి వృత్తంతో నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకించే

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి

ఖమ్మం చర్చికాంపౌండ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు తెరవెనుకగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు. మాదిగ జాతి ఓట్లతో గెలిచిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితర కొంతమంది కీలక పదవుల్లో ఉన్న కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రి నిర్ణయానికి, ఏఐసీసీ నిర్ణయానికి సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ తెరవెనుక రాజకీయం నడుపుతున్నారన్నారు. అటువంటి వారిపై రాహుల్‌గాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఎస్సీ రిజర్వేషన్‌కు కట్టుబడతామని, మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన సంగతి సదరు ఎమ్మెల్యేలు గుర్తుంచుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో మాదిగల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ గెలిచిన సంగతి గుర్తుచేశారు. మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలలో మాదిగ ఓటర్లు గెలుపోటములు ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో రెండు ఎస్సీ నియోజకవర్గాల్లో మాల ఉపకులాలకు చెందినవారు ఎమ్మెల్యేలుగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో మట్టె గురుమూర్తి, తోళ్ల రాకేష్, కష్టాల క్రాంతి, దూడ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు...

భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్

అశ్వాపురం నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, సమాజసేవతో పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పేర్కొన్నారు. అశ్వాపురం పోలీస్, భద్రాచలం రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని మారుమూల వేములూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరాన్ని ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకోసం ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగ పర్చుకోవాలన్నారు. గ్రామాల్లో యువత సన్మార్గంలో పయనించి, సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. అసాంఘిక శక్తులకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించవద్దని, ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం, క్రీడలువంటి మౌలిక సదుపాయాల కల్పనకు తమశాఖ కూడా కృషి చేస్తుందన్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు గిరిజనుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం ఎస్పీ వైద్యశిబిరాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. వైద్యసేవలు అందించిన వైద్యులను సన్మానించారు. కాగా వైద్యశిబిరంలో 300 మంది గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు, భద్రాచలం రోటరీక్లబ్ అధ్యక్షుడు బాలాజీ, శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ రోహిత్‌రాజ్ ముందుగా అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో వేములూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం బైక్‌పై నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన మణుగూరు-అశ్వాపురం మండల సరిహద్దు ప్రాంతమైన మనుబోతులగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత, పెద్దలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వలస ఆదివాసీలతో మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుగుమట్లలో గుబాళించిన కార్తీక సౌరభం

ఖమ్మం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వనసమారాధనలో భాగంగా ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్కులో భారీఎత్తున నిర్వహించిన కమ్మవారి వనసమారాధన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్ చూపరులను ఆకట్టుకుంది. ముందుగా శివలింగం వెనుక భాగంలో వెంకటేశ్వరస్వామి ఫొటో, శివుని విగ్రహంతోపాటుగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సెట్టింగ్ వేశారు. వనసమారాధనకు వెళ్లిన వారు ముందుగా పూజలు నిర్వహించిన శివలింగం వద్ద దర్శనం చేసుకుని అనంతరం సెట్టింగ్‌లో ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహం వద్ద సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అలాగే వేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సుమారు 50వేల మంది వరకు వన సమారాధనకు హాజరవగా.. నిర్వాహకులు వారికి విందు భోజనాలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వెలుగుమట్ల పరిసరాల్లో భారీఎత్తున వాహనాలు పార్కింగ్ అయ్యాయి.

భక్తులతో కిక్కిరిసిన రామాలయం

భద్రాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. కార్తీకమాస ఆదివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు భారీగాపోటెత్తారు. నిత్యకల్యాణంలో 114 జంట లు పాల్గొనగా స్వామివారికి ఆర్జిత సేవగా నిర్వహించే మూలవరుల పంచామృతాభిషేకంలో 44మంది, సువర్ణ పుష్పార్చనలో 50మంది పాల్గొన్నారు. రామయ్య దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి రామయ్యను దర్శించుకొని వెళ్లారు. ఇదిలా ఉండగా రామయ్యకు రూ.25,79,096 ఆదాయం సమకూరింది. ఇందులో లైసెన్సుల ద్వారా రూ.9లక్షలు రావడం జరిగింది. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.6.17 లక్షలు, మెయిన్ కౌంటరు ఈ టికెట్ ద్వారా రూ.5.17లక్షలు, మ్యూజి యం ద్వారా రూ.1.36 లక్షలు దేవస్థానం ఖజానాకు జమ చేయడం జరిగింది.



వనసమారాధనకు హాజరైన దృశ్యం







జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



పురస్కారం అందజేస్తున్న దృశ్యం

వేద పండితులు గుదిమెళ్లకు భద్రభారతి పురస్కారం అందజేత

బాలకాండ గ్రంథం, ట్రస్టు లోగో ఆవిష్కరణ

భద్రాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానం అదర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులకు భద్రభారతి పురస్కారానికి ఆదివారం అందజేశారు. భద్రాచలంలో జరిగిన మధుర కవయిత్రి అభినవ మొల్ల డా.చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ సంస్మృతిసభను పురస్కరించుకొని ఈ పురస్కారాన్ని తాళ్లూరి పంచాక్షరయ్య, దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులు, జంధ్యాల వెంకటరమణ, ప్రముఖ కవి, పండితులు నల్లాన్ చక్రవర్తుల శ్రీరామచక్రవర్తిలు గుదిమెళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణమాచార్యులు దంపతులను ఘనంగా సన్మానించారు. అలాగే వాల్మీకి శ్రీరామాయణ బాలకాండను సృజనము బాలకాండము ద్విపద కావ్యాన్ని కరుణ శ్రీజంధ్యాల పాపయ్యశాస్త్రి ద్వితీయ కుమారులు జంధ్యాల వెంకటరమణ ఆవిష్కరించగా, డా.చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ సంస్కృతి సేవా ట్రస్టు లోగోను భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు ఆగమరత్న పొడిచేటి రామచంద్రాచార్యులు ఆవిష్కరించారు. ఈ సభకు ప్రముఖ కవి పండితులు నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి అధ్యక్షత వహించగా గట్టువెంకటాచార్య, చక్రవర్తుల వెంకట రఘు పుంగవాచార్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు నడుం కట్టాలి

(5వ పేజీ తరువాయి)

భారత రాజ్యంగంలోని మౌలిక విలువలు, మతం, లౌకికతత్వంపై ఘర్షణ పడ్డామన్నారు. ఇప్పుడు ఆ ఘర్షణ విశ్వరూపం చూస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల రాజకీయ ఉనికిపై, న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిపై, భారతీయతపై దాడి జరుగుతోందన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు రూపు మాపాలన్నారు. దేశంలో గౌతమ్ అదానీ గంటకు రూ.1600 కోట్లు సంపాదిస్తుండగా కటిక పేదరికంలో మగ్గేవారు అనేక మంది ఉన్నారని కే.నాగేశ్వర్ పేర్కొన్నారు.

దేశంకార్పొరేట్ల రాజ్యం: వి. కృష్ణయ్య

కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక భారతదేశం కార్పొరేట్ల రాజ్యంగా మారిందని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య విమర్శించారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలు ఆయన వచ్చాక ప్రమాదంలో పడ్డాయన్నారు. భారతరాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో మనందరికీ సీతారాం ఏచూరి విప్పి చెప్పారన్నారు. మోదీ పదేళ్ల పాలనలో 252 చట్టాలు చేశారని, వీటి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిందన్నారు. రైతుల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులన్నింటిపైకార్పొరేట్ కంపెనీల పెత్తనమేనని విమర్శించారు. భారత స్టాక్ మార్కెట్లోని 1,500 కంపెనీల్లో 50 శాతం వాటా కార్పొరేట్ చేతిలోనే ఉందని సీతారాం ఏచూరి స్పష్టం చేశారన్నారు. ప్రజలందరీ స్వాతంత్ర్యం కార్పొరేట్ స్వాతంత్రంగా మారుతోందన్నారు. రాష్ట్రాల హక్కులను కూడా హరిస్తున్నారని, చివరకు పంట కాల్వల్లో పారే నీరు కూడా తమ నియంత్రణలో ఉంటుందని, దాని నిర్వహణకు కావాల్సిన డబ్బులు మాత్రం పంపాలని రాష్ట్రాలకు కేంద్రం అల్టిమేటం జారీ చేసిందన్నారు.

భారీగా హాజరైన పూర్వవిద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి 1,500 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర తదితరులు ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు ఆలపించిన గేయాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎభారతీయతకు భాష్యల్, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన ఎసీతారాం ఏచూరి, జనవిజ్ఞాన వేదిక ఎజీవ పరిణామమ్ తదితర పుస్తకాలను ఆవిష్కరించారు. దీనికి ముందు ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి మాటూరి రామచంద్రరావు సహా అసువులు బాసిన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులకు సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఏజే రమేష్ ప్రవేశపెట్టారు. ఎస్ఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ పూర్వ విద్యార్థి కొండపల్లి పావన్ ఆవిష్కరించగా మరో విద్యార్థి ఉన్నం లక్ష్మీనారాయణ రాజ్యాంగ ప్రవేశిక పఠనం ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, విప్లవ్‌మార్, అనురాధ అధ్యక్షవర్గంగా ఈ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



ఖమ్మంలో వనసమారాధనలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు24 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం అర్బన్‌పార్కులో ఆదివారం కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన నిర్వహించిన కమ్మ వనసమారాధన కార్యక్రమంలో మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ జాతి ప్రతిభ మూడో శతాబ్దంలోనే బయటపడిందన్నారు. కాకతీయులు, ముసునూరురాజుల వంటి ఎందరో రాజ్యపాలన సాగించారని గుర్తు చేశారు. కమ్మవారు వృత్తిపరంగా వ్యవసాయదారులే అయినా కాలమాన పరిస్థితిలో ప్రపంచీకరణ కారణంగా అన్ని వృత్తుల్లో ప్రతిభ చూపుతున్నారన్నారు. రాజకీయ, సినీరంగం, వ్యాపారం, వైద్య, ఇంజనీరింగ్‌తోపాటు అమెరికాలోని అగ్రగామి కంపెనీలకు కమ్మ వారే సీఈవోలుగా ఉన్నారని తెలిపారు. తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చి జిల్లా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నానని మంత్రి తుమ్మల ప్రకటించారు. పూర్వీకులు ఇచ్చిన సంస్కృతి, సంప్రదాయం, కీర్తిని, ప్రతిభను, ప్రతిష్ఠను కాపాడుకుంటూ అన్ని మతాలు, కులాలకోసం పాటు పాడితేనే కమ్మ జాతి ఉన్నత శిఖరాలకు ఎదుగుతుందన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కృషిచేస్తానని తుమ్మల ప్రకటించారు. భద్రాచలానికి రైల్వేమార్గాలు మంజూరయ్యాయని, అలాగే పలు జాతీయ రహదారుల పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ ఇచ్చిన సహకారంతో తాలిపేరు, పెద వాగు, మూకమామిడి ప్రాజెక్టులు నిర్మించానని, సాగర్ ఆధునీకరణ, భక్తరామదాసు వంటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేశానన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. రఘునాథపాలెం మండలాన్ని కూడా ఎత్తిపోతల పథకం ద్వారా సస్యశ్యామలం చేస్తామన్నారు.

వెలుగుమట్ల అర్బన్‌పార్కును ఆదర్శవంతంగా తీర్చిదిద్ది పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో మరికొన్ని ఎకో-టూరిజం పార్కులు ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి కమ్మ జాతి రాజకీయాల్లో కూడా గుర్తింపు సాధించిందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో మంత్రి తుమ్మల జిల్లా అభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. ఈ వనసమారాధన కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫొటో ప్రదర్శన, దేవాలయ సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాష్ట్ర ఇరిగేషన్ సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, టీఎస్‌జీవోస్ జిల్లా నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీకాంత్, భార్గవ్ చైతన్య పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ రావూరి కరుణసైదుబాబు, గుడివర్తి నాగేశ్వరరావు, చంద్ర రాంబాబు, తూము శివ, నల్లమల్ల ఆనంద్, నెల్లూరి కోటేశ్వరరావు, బండి మాధవరావు, జట్ల శ్రీను పాల్గొన్నారు.

వనమంతా సందడి!

(5వ పేజీ తరువాయి)

డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు. మధిరలోని కృష్ణాపురం మామిడితోటలో నిర్వహించిన కమ్మసంఘం వనభోజనాల్లో టీడీపీ నాయకుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ, కరివేద వెంకటేశ్వరరావు, టీవీఆర్ తదితరులు పాల్గొన్నారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆత్కూరులోని కృష్ణారెడ్డి మామిడితోటలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి హాజరయ్యారు. రామకృష్ణ మామిడితోటలో నిర్వహించిన మున్నూరుకాపు వనసమారాధన కార్యక్రమంలో జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయ్‌భాను, ఆర్జేసీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ పాల్గొన్నారు. నేలకొండపల్లిలో కమ్మ, కాపు, పద్మశాలీలతోపాటుగా వివిధ కులాలు వేర్వేరుగా వన సమారాధనలు నిర్వహించారు. నేలకొండపల్లి అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడితోటలో కమ్మవారి ఆత్మీయ వన సమారాధన ఘనంగా నిర్వహించారు. బౌద్ధస్థూపం వద్ద జరిగిన పద్మశాలీల వనసమారాధన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పాల్గొన్నారు. ఎస్సీ, బీసీ కాలనీలోని బాజా పాండు రంగయ్య మామిడి తోటలో మున్నూరుకాపు సంఘం, కూసుమంచిలోని మామిడితోటలో ఆర్యవైశ్యుల వనసమారాధన నిర్వహించారు.

ఆత్మీయ పలకరింతలు.. విందూ వినోదాలు...

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు24 (ఆంధ్రజ్యోతి): తోటల్లో కోయిల పాటలకు దీటుగా గాయనీగాయకుల స్వరాలు వెల్లి విరిశాయి.. కొమ్మారెమ్మల్లో పూలు, కాయలకు మించి నవ్వుల పువ్వులు కాశాయి.. తమ రోజువారీ పనివత్తిళ్లను పక్కనపెట్టి ప్రజలు తమ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ప్రకృతి ఆరాధనతోపాటు సరదా కాలక్షేపం చేశారు. చెట్లను పూజించటం, స్వచ్ఛగాలి పీల్చటం, పచ్చని తోటల్లో గడపటం వంటి సంప్రదాయ ఆచారం గత ఎంతోకాలంగా వస్తోంది. ఆ ఆచారాన్ని పాటిస్తూ ప్రజలు వనాలకు పోటెత్తారు. దీంతో ఆదివారం ఖమ్మం పరిసరాల్లోని వనాలు జనాలతో కళకళలాడాయి.. చివరి ఆదివారం కావటంతో ఖమ్మం నగరవాసులు చెరుకూరి వారితోట, తదితర మామిడి, జామ తోటలకు తరలివెళ్లారు. కమ్మ సంఘం, యాదవ సంఘం, బ్రాహ్మణ సంఘం, ఆర్య వైశ్య సంఘం తదితర కుల సంఘాలు ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమాలకు పెద్దఎత్తున స్పందన లభించింది. కార్తీకమాసంలో వనాలను సందర్శించే సంప్రదాయం ఉండటంతో కులాల వారీగా ప్రజలు వనభోజనాలకు ఆసక్తి చూపారు. మామిడి, జామ తదితర నీడనిచ్చే తోటల్లో సామూహికంగా ప్రకృతి ఆరాధనతోపాటు వంటలు, భోజనాలు, ఆటపాటల్లో మునిగి తేలారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాటలు, నృత్యాలు, మిమిక్రీ తదితర కళలను ప్రదర్శించారు. బస్సులు, ఆటోలు, తదితర రవాణా సాధనాలను ఏర్పాటు చేశారు.

సర్వే డేటా ఎంట్రీ కీలకం

(5వ పేజీ తరువాయి)

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, సర్వే డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం లాంటి సమస్యలు తలెత్తాయని, ఈ సందర్భంలో ఫోన్ చేసి అందుబాటులో ఉండాలని చెప్పాలన్నారు. సర్వే గురించి తెలియజేసి వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు వెళ్లిన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, పాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించినట్లు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 5 లక్షల 68వేల 493ఇళ్లను సర్వే కోసం గుర్తించామని, నవంబరు 23నాటికి మొత్తం 4లక్షల 78వేల 868ఇంటింటి సర్వే పూర్తయిందని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 59.50శాతం, పాలేరులో 93.64శాతం, మధిరలో 94.41 శాతం, వైరాలో 96.98శాతం, సత్తుపల్లిలో 98.09శాతం, జిల్లా వ్యాప్తంగా 84.23 శాతం సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. డేటా ఎంట్రీ చేసేందుకు అవసరమైన ఆపరేటర్లను గుర్తించామని, పక్కాగా నమోదు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని వివరించారు.

ఎర్ర జెండా నీడలో ఎదిగి..

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థిగా ఎడ్లబండి గుర్తుపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ టీడీపీలోనే కొనసాగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడానికి విశేష కృషి చేశారు. తర్వాత టీడీపీ 2009లో ఇల్లెందులో పార్టీ టికెట్ ఇవ్వడంతో ఆయన ఘన విజయం సాధించారు.నక్సల్స్ ఇలాకాలో సైతం ఒంటరిగా సంచరిస్తూ పల్లెలు గూడాలు, తండాలు తిరుగుతూ ప్రజల అభిమానాన్ని పొందుతూ టీడీపీ విస్తరణకు కృషి చేశారు. 2014లో టీడీపీ టికెట్ ఇవ్వకపోవడంతో, టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అయితే టీఆర్ఎస్‌లోనూ ఇమడలేకపోయిన అబ్బయ్య కాంగ్రెస్‌లో చేరి ఇల్లెందు ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా యత్నించారు. కాంగ్రెస్ టికెట్ కూడా లభించకపోవడంతో ఇల్లెందు నియోజకవర్గంలో 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

అనంతరం బీజేపీలో చేరిన అబ్బయ్యకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించింది. ఆ పార్టీ అభివృద్ధి, విస్తరణ కోసం పని చేసినప్పటికీ బీజేపీ సైతం అయనకు టికెట్ ఇవ్వకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల తరుణంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ చేరి ఇల్లెందు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేశారు. కొద్ది నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఏడాది కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వైద్య చికిత్సలు పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు.

అబ్బయ్య తొలుత సింగరేణి కాలరీస్ ఇల్లెందు స్టట్‌ఫిట్ బొగ్గుగనిలో కార్మికుడిగా పనిచేశారు. ఎర్రజెండాతో 28ఏళ్ల అనుబంధాన్ని, టీడీపీతో 12ఏళ్ల బంధాన్ని తెంచుకొని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలో చేరినప్పటికీ ఆయనకు ఆ పార్టీల్లో సరైన ఆదరణ లభించలేదని పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసేవారు. ఏ పార్టీలో పనిచేసినా అబ్బయ్య నిరాడంబర జీవిత గడపడమేకాక నమ్మిన వారి కోసం, ఆయన అనుచరుల కోసం ఎంతకైనా తెగించేవాడని ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారించేవాడన్న పేరుగడించారు. ఇల్లెందు నియోజకవర్గంలో బయ్యారం ఇనుప ఖనిజాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబీకులు అక్రమంగా తరలించుకుపోవడాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు జరిపారు. అంతేకాక టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని, టీడీపీ రాష్ట్ర కమిటీ నాయకులతో పాటు 90మంది టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను బయ్యారం రప్పించి ఇనుప గుట్టలు ఎక్కించి అక్రమాలను స్వయంగా చూపించి ఇనుప ఖనిజ అక్రమ రవాణకు అడ్డుకట్ట వేసిన ధీశాలిగా ఊకె అబ్బయ్య పేరు గడించారు. సీతారామ ప్రాజెక్టు నిర్మించి తొలుత ఇల్లెందు నియోజకవర్గానికి సాగు నీరు ఇవ్వాలని, బయ్యారం పెద్ద చెరువు, టేకులపల్లి మండలం రోళ్లపాడు చెరువు అభివృద్ధి కోసం తీవ్రంగా తపించారు. ఇల్లెందు మండలం మర్రిగూడెంలో ఎత్తిపోతల పథకాన్ని ఇల్లెందు నుంచి గుండాల వెళ్లే రహదారి పనులను పూర్తి చేయించారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఐక్యతతోనే రాజ్యాధికారం

» యాదవ వన సమారాధనలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదవ, కురుమల ఐక్యత ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని, కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా గొల్ల కురుమలు నిలిచారని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో గొల్ల కురుమలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. ఆదివారం ఖమ్మంలో గొల్ల కురుమల వనసమారాధన కార్యక్రమాన్ని చెరుకూరి వారి తోటలో నిర్వహించారు. ఈ కార్యక్రమం అఖిలభారత జిల్లా యాదవ మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, యాదవ్. యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనలో ముఖ్యతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన గొల్ల కురుమలకు రాజకీయంగా ప్రాతినిధ్యం కలగడం లేదని, ఎంతో ఘన చరిత్ర కలిగిన కురుమ యాదవులను నిర్లక్ష్యం చేస్తే గత ప్రభుత్వానికి జరిగిన గతే పడుతుందని అన్నారు. అతి తక్కువజనాభా ఉన్న అగ్రవర్ణాల వారుపదవులు అనుభవిస్తున్నారని,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోతమకు ప్రాతినిధ్యం కలిగించాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి మల్లన్న దేవస్థానం మాజీ ఛైర్మన్ సంపత్, సంగెంరెడ్డి సుందర్ రాజు, గొర్ల యశ్వంత్ యాదవ్, పుచ్చకాయల వీరభద్రం దుబాకుల శ్రీనివాస్,దుబాకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే నాకు తల్లిదండ్రులు

» రాజకీయంగా పెంచి పోషించింది సత్తుపల్లి
» ఈ పదవీకాలంలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తా
» రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సత్తుపల్లిలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడిని అయిన తనకు సుదీర్ఘకాలంగా అభివృద్ధిలో పాలుపంచుకునేలా రాజకీయంగా పెంచిపోషించిన సత్తుపల్లి ప్రజలే తనకు తల్లిదండ్రులని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్‌పార్క్‌లో ఆదివారం నిర్వహించిన కమ్మ వారి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా రామోజీరావు ప్రాంగణంలో ఎన్టీఆర్, రామోజీ చిత్రపటాలకు పూలుజల్లి ఘన నివాళులర్పించారు. ఈ ప్రాంతం పాడిపంటలతో అభివృద్ధి చెందాలని, అందరం సుఖసంతోషాలతో జీవించాలని ఆ పరమశివుడిని ప్రార్థిస్తున్నానన్నారు. చాలామంది పెద్దల సహకారంతో మీ ప్రతినిధిగా ఉండే అవకాశాన్ని ఎన్టీఆర్ కల్పించారని, ఎంతోమంది పరిపాలించిన ఈ ప్రాంతంలో మిగిలిపోయిన పనులు చేసేభాగ్యం శ్రీరామచంద్రుడు కల్పించారన్నారు. ఎక్కడున్నా రాజకీయంగా భిక్షపెట్టిన సత్తుపల్లి ప్రజలను జీవితాంతం మరిచిపోనన్నారు. పెద్దవాగు, సాగర్ జలాలు, తమ్మిలేరు, గన్నేరు జలాలతో పాటు పలు ప్రాంతాలకు అవకాశం ఉండగా ఈ ప్రాంతంలోని అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు అందించేందుకు గత ప్రభుత్వంలో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టును ఈ పదవీ కాలంలో పూర్తి చేయాలనేదే తన ఆకాంక్ష అన్నారు. ఈ ప్రాంతంలో కృష్ణ, గోదావరి తల్లుల అనుసంధానం పూర్తయితే భవిష్యత్ తరాల అభివృద్ధిని ఇవ్వాలనేదే తన ఏకైక లక్ష్యమన్నారు. భవిష్యత్‌లో పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలు పామాయిల్ వ్యవసాయంపై ఆసక్తి చూపితే రాబోయే కొద్దిరోజుల్లోనే వేంసూరు మండలంలో కల్లూరుగూడెం ఫ్యాక్టరీని కూడా ప్రారంభిస్తానన్నారు.

తనకు రాజకీయ జన్మనిచ్చిన మీ అందరికీ ఎన్ని జన్మలెత్తిన రుణం తీర్చుకోలేనని, ఎక్కడున్నా మీలో ఒకడిగా బతకడమే తనకు ఇష్టమని అన్నారు. ఖమ్మంలోని హాస్టల్‌లో విద్యార్థుల కోసం దాతలు ముందుకు రావాలని, క్రమశిక్షణతో మీ పిల్లలను చదువుకోవాలన్నారు.

అనంతరం కమిటీ సభ్యులను తుమ్మల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నున్నా రామకృష్ణ ప్రసంగించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేష్, చలసాని సాంబశివరావు, చల్లగుళ్ల నరసింహారావు, నాయుడు వెంకటేశ్వరరావు, దొడ్డా హైమావతి శంకరరావు, వీరపనేని రాధిక బాబీ, వడ్లపట్ల ఫణికుమార్, బాలయ్య, నరుకుళ్ల శ్రీను, గాదె చెన్నారావు, కూసంపూడి రామారావు, మధు, దమ్మలపాటి రవికుమార్, బొంతు చంద్రశేఖర్, వార్డు మెంబర్లతో పాటు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్యవైశ్యుల సహకారం గొప్పది

» కార్తీక వనసమారాధనలో మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మంకలెక్టరేట్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఆర్యవైశ్యులు అందించిన సహకారం మరువలేనిదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం చెరుకూరి వారి తోటలో నగర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ఆర్యవైశ్యులు అందించిన సహకారం చేయూతను ఎప్పటికీ మరువలేమన్నారు. వారికి సముచిత స్థానాన్ని కల్పించడంతో ఎప్పటికీ ముందుంటామని తుమ్మల అన్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని వర్గాల ప్రజలకు ఆదరణగా ఉంటారని సమాజంలో వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేశారి కొనియాడారు. వారి సమస్యల పరిష్కారానికి ఈ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కూడా వనసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మంత్రులను , ఎంపీనీ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 108 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజలను నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులతో సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. పిల్లలు, వృద్దులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటలు, పాటలతో ఉత్సాహంగా గడిపారు.

కమ్మ వారు సేవారంగాల్లో ముందుడాలి: తుమ్మల



చింతనిప్పు వెంకటయ్యను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

వైరా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కమ్మ జనసేవాసమితి సమాజ అభివృద్ధికి పాటుపడాలని కమ్మ వారంతా సేవారంగాల్లో ముందుండాలని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కమ్మ జనసేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సోమవరం సమీపంలోని కొల్లివారి మామిడి తోటలో నిర్వహించిన కార్తీకమాస వనసమారాధనలో మంత్రి తుమ్మల పాల్గొని ప్రసంగించారు. కమ్మజాతి అందరికి ఆదర్శవంతంగా వుండి సమాజ హితానికి పాటుపడాలని పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్, రాయలనాగేశ్వరరావు, రాష్ట్ర ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రసంగించారు. వైరా కమ్మజన సేవాసమితీ అధ్యక్షుడు చింతనిప్పు వెంకటయ్యను మంత్రి తుమ్మల సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలతో అలరించారు. కమ్మజన సేవాసమితి సెక్రటరీ చింతనిప్పు రాంబాబు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ శ్రీరామనేని రామస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసినప్పుడే గుర్తుంచుకుంటారు

» ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి వనమా

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపుల ఐక్యత మన ధ్యేయమని, కులాలను, మతాలను గౌరవిస్తూనే మున్నూరు కాపులు అభివృద్ధి సాధించాలని, అందరికి ఆదర్శంగా నిలవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలం మామిడి తోటలో జరిగిన మున్నూరుకాపు కార్తీక వనసమారాధన మహోత్సవంలో వారు మాట్లాడారు. విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించి ముందు వరుసలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సామూహిక వనభోజనాలు చేశారు. ఈ వన సమారాధనలో మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, మున్సిపల్‌ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, రంగాకిరణ్, వనమా రాఘవ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

అందరినీ ఆదరించేది కమ్మవారే..

» కమ్మవారి కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే కూనంనేని



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, కోనేరు చిన్ని

పాల్వంచ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అందరినీ ఆదరించేది కమ్మవారే అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం పాల్వంచ కమ్మసేవాసంఘం ఆధ్వర్యంలో లారీ అసోసియేషన్ ఫంక్షన్ హాలు సమీపంలోని సంఘానికి చెందిన స్థలంలోకార్తీక మాస వన సమారాధన ఉత్సాహంగా సాగింది. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పంచాక్షరయ్య ట్రస్ట్ ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య జ్యోతిప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాల్వంచలో సంఘం ఆధ్వర్యంలో రెండు ఎకరాల స్థలం సేకరించడం అభినందనీయమని, సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న కొత్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంచికంటిభవన్ నిర్మాణం చేయాలని, దానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పలు ప్రభుత్వశాఖల్లో రిటైరైన వారిని ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబాలకు మంత్రి సీతక్క పరామర్శ



శ్రీనివాసరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

పినపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పినపాక కాంగ్రెస్ నాయకుడు గట్ల శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క సందర్శించారు. శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండేరు వెంకటనారాయణ, కొండా సతీష్‌రెడ్డి, కంది ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భద్రాచలం నవంబరు24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరోకరికి గాయలైన సంఘటన బూర్గంపాడు మండలం సారపాక సమీపంలో బ్రిడ్జి వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాచలంలోని కొర్రాజులగుట్ట ప్రాంతానికి చెందిన దాసరి రాజేష్ (24), ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం చింతల గూడెం గ్రామానికి చెందిన కిరణ్‌లు ఇరువురు బైక్‌పై భద్రాచలానికి వస్తుండగా, సారపాక వద్ద బ్రిడ్జి సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడగా, క్షతగాత్రులను స్థానికులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రాజేష్‌ను పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కిరణ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

గుండెపోటుతో సెర్ఫ్ ఉద్యోగి .....



వెంకటనారాయణ

ఆళ్లపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో సెర్ఫ్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని మర్కోడు గ్రామంలో జరిగింది. మర్కోడు గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటనారాయణ(58)సెర్ఫ్(వెలుగు)లో కాంట్రాక్ట్ పద్ధతిలో కొంత కాలంగా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆదివారం తెల్లవారుజామున అతడికి గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ హనుమంతరావు, న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ నాయకులు సత్యనారాయణ, ప్రజాపంథ మాస్‌లైన్ నాయకులు మాచర్ల సత్యం, సీపీఐ జిల్లా నాయకులు రేసుఎల్లయ్య, టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, ఏపీఎం రామ్‌కుమార్, వెలుగు సిబ్బంది నివాళులర్పించారు.

అనారోగ్యంతో కాళీమాత ఆలయ అర్చకుడు..



సత్యనారాయణ(ఫైల్)

మణుగూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పైలట్ కాలనీ ఏరియాలోగల కాళీమాత ఆలయం ప్రధాన అర్చకులు, న్యాయవాది ఉప్పలపాటి సత్యనారాయణ శాస్త్రీ(53) అనారోగ్యంతో ఆదివారం తుది శ్వాస విడిచారు. కాళీమాత ఆలయ ధర్మకర్తగా 35 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. అయ్యప్ప మాలదారులకు గురు స్వామిగా ఉంచి ఆలయంలో అయ్యప్పల పీటాన్ని ఏర్పాటు చేసి దాదాపు 26 ఏళ్లుగా ప్రతి రోజు అయ్యప్ప భజన కార్యక్రమాలతో పాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్ఎస్ నాయకులు, మణుగూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శేషగిరి శర్మ మరియూ కమిటీ సభ్యులు ఆలయానికి చేరుకుని భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. మణుగూరు బార్ అసోసియేషన్ కూడా శాస్త్రీ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేసింది.

మహిళల చేతిలోనే కుటుంబ ఆరోగ్యం

» రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



తుమ్మలను సన్మానిస్తున్న మానుకొండ సుజాత

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళల చేతిలోనే కుటుంబ సభ్యుల ఆరోగ్యం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం అర్బన్ బాలపేట, మానుకొండ వ్యవసాయ క్షేత్రంలో సిటీ ఆఫ్ టేర్రాస్ గార్డెన్ (సీటీజీ) ఆధ్వర్యంలో మిద్దే తోటల జిల్లా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంనగరంలో వందల సంఖ్యలో నివాసాలపై మిద్దే తోటలు పెంపకం పెరగటం మంచి శుభపరిణామంగా పేర్కొన్నారు. ఏడుగురు మహిళలతో ప్రారంభమైన మిద్దే తోటల సాగు ఇప్పుడు 70వేల మంది వరకు వెళ్లిందని, త్వరలోనే 70లక్షల కుటుంబాల్లో మిద్దే తోటలు పెంపకం రావాలని, ఎవ్వరి ఇంట్లో కూరగాయాలు, పండ్లు వారే తినే రోజు వస్తొందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. కల్తీ లేకుండా ఏ పదార్థం తయారు కావటం లేదన్నారు. ఆహారపదార్థాలు కల్తీతో పాటుగా ఎక్కువ పురుగు మందులు వాడకంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు సంపాదన హాస్పటల్స్‌కు సరిపోని రోజులు వచ్చాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. సామాన్యులు హాస్పటల్స్‌కు వెళ్లి వైద్య సేవలు పొందే రోజులు లేవన్నారు. ప్రకృతి వ్యవసాయం, మిద్దే తోటలు, పెరటి తోటలు సాగు ద్వారా కల్తీ లేని కూరగాయాలు, పండ్లు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వ పరంగా మిద్దే తోటల సాగుకు కావాల్సిన ప్రోత్సాహకంపై ఆలోచన చేసి త్వరలో నిర్ణయాలను ప్రకటిస్తామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మిద్దే తోటల సాగుపై మహిళలకు ఇంకా అవగాహన పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి మాట్లాడుతూ కూరగాయాల సాగు, ఆదునిక విధానాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సీటీజీ నిర్వాహకులు ఈజేల సరోజ, మానుకొండ జ్యోతి, బత్తుల సరోజిని, వాసిరెడ్డి నిర్మల, క్రైసర్, శ్రీనివాస్, రమాదేవి, నవ్య, అనూష, ప్రశాంతి పాల్గొన్నారు.

నేడు మధిరలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు

» కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

మధిరటౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం మధిర లోని వర్తక సంఘ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాలాచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

» భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

పాల్వంచ టౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆన్‌లైన్ దరఖాస్తుల విచారణలో భాగంగా పట్టణంలోని రాంనగర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఆ ప్రాంతంలో ఆదివారం కలెక్టర్ సందర్శించి లబ్ధిదారుల వివరాలను పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలన దరఖస్తు ద్వారా ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను పూర్తిస్థాయిలో విచారించి అర్హులకు మాత్రమే అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ వేణుగోపాల్, మునిసిపల్ కమిషనర్ సుజాత, డిప్యూటీ తహసిల్దార్ విజయచందర్, మునిసిపల్ మేనేజర్ ఎల్‌వి. సత్యనారాయణ, శానిటరి ఇన్‌స్పెక్టర్ కేవీ. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరాలి

పాల్వంచ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి ఆలోచనలతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. ఆదివారం పాల్వంచ బొల్లోరిగూడెంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి దాసరి అనసూయ, ఏఎస్‌సీడబ్ల్యూవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జిల్లా జట్లకు ప్రథమ స్థానం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మహబూబాద్ జిల్లా కేసముద్రంలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీలలో ఖమ్మం జిల్లా బాలుర, బాలికల జట్లు సత్తా చాటి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బాలుర జట్టు రంగారెడ్డి జిల్లా జట్టుపై జరిగిన ఫైనల్ పోటీలో 18-9 స్కోరు తేడాతో, బాలికల జట్టు నల్గొండ జట్టుపై 15-13 స్కోరు తేడాతో విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకున్నాయి. .అంతే కాకుండా బాలుర జట్టులో క్రీడాకారులు వెంకటసత్యారామ్, సాయిదీపక్, అయాన్, బాలికల జట్టు నుంచి అఖిల, మహేశ్వరి, బింధుప్రియ త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు సైతం ఎంపిక య్యారు. అ సందర్భంగా రాష్ట్ర పోటీలలో విజయం సాధించిన జిల్లా క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నర్సింహామూర్తి, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, నెట్‌బాల్ సంఘం బాధ్యులు ఫణికుమార్, రమణ తదితరులు అభినందించారు.



ప్రథమ బహుమతిని అందుకుంటున్న బాలికల జట్టు



ప్రథమ బహుమతిని అందుకుంటున్న బాలుర జట్టు







అర్బన్ పార్క్ రహదారికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

80 అడుగుల రహదారులు

- ఖమ్మంలో భవిష్యత్ ప్రజలకు ఇబ్బంది లేకుండా కార్యచరణ చేయాలి
- ఏ ప్రాంత చిహ్నాలతో.. ఆ ప్రాంతం గుర్తించేలా సుందరీకరణ జరపాలి
- కేఎంసీ అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఖమ్మం నగరానికి అనుగుణంగానే రహదారుల విస్తరణ జరపాలని, భవిష్యత్‌లో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రధానమైన రహదారులు 80 అడుగులతో నిర్మాణం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేఎంసీ కమిషనర్ అభిషేక్‌అగస్త్యకు సూచించారు. ఆదివారం ఖమ్మం 15వ డివిజన్ ఖమ్మం అటవీ అర్బన్ పార్క్‌కు వెళ్లే రహదారుల నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఏ ప్రాంత చిహ్నాలతో ఆప్రాంతం గుర్తింపు ఉండేలా ఖమ్మం సుందరీకరణకు కార్యచరణ జరపాలని, పురాతన ఆనవాళ్లు తొలగించవద్దని సూచించారు. కేఎంసీకి రావాల్సిన ఆదాయంపై అధికారులు దృష్టి సారించాలని, ఎల్‌ఆర్‌ఎస్‌ను వేగవంతం చేయాలని, ఖమ్మంలోని వాల్ బోర్డుల ధరలను పునః పరిశీలించి నిర్ణయించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వాహణ ఇంకా పెరగాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును ఏకో ప్రాజెక్టు కింద తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులపై నివేదికలు తెప్పించుకొని అభివృద్ధికి కార్యచరణ జరపాలని సూచించారు. ప్రశాంతంగా ఉండేందుకు జిల్లా నలుమూలల నుంచి అర్బన్ పార్కుకు వచ్చేలా అటవీశాఖ, పర్యాటకశాఖ అధికారులను సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలని ఆదేశించారు.అర్బన్ పార్కుకు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్‌అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్లు రావూరిసైదుబాబుకరుణ, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	46 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	50
బీరకాయ	58
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	24
పొట్లకాయ	38
దోసకాయ	38-58
చిక్కుడు	74
నాటుచిక్కుడు	100
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	34
దొండ	40-48
సొరకాయ	20
క్యారెట్	68
క్యాప్సికం	58
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవకీనందన వాసుదేవ
సినీ గెలాక్సీ:	జీబ్రా

ఘనంగా మహారుద్రయాగం



ఖమ్మంసాంస్కృతికం,నవంబరు24 (ఆంధ్రజ్యోతి): సహస్రచండీ సహిత మహారుద్రయాగం ఖమ్మం మమతా రోడ్‌లోని ఫైవ్ ఎలిమెంట్స్ పక్కనగల బహిరంగ ప్రదేశంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 29వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజున విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే గోపూజతో రుద్రయాగానికి అంకురార్పణ చేశారు. రుషికేష్ నుంచి వచ్చిన రుత్వికులు పదకొండు రకాల చండీ హోమాలను జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్ర కార్యక్రమాల్లోభాగంగా చండీ హోమం, తదితర పూజా క్రతువులు నిర్వహించారు. శనివారం రాత్రి నగరసంకీర్తన జరిపారు.

ఇళ్లస్థలాల ప్రక్రియను వేగవంతం చేస్తాం

- జర్నలిస్టులకు మంత్రులు తుమ్మల, పొంగులేటి హామీ

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన మూడు జర్నలిస్టు యూనియన్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్), టీడబ్ల్యూజే ఎఫ్ (ఫెడరేషన్) ఆధ్వర్యంలో స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ఉదయం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావును కలిశారు. శనివారం రాత్రి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. మంత్రులు, సొసైటీ కొత్త పాలక వర్గాన్ని అభినందించారు. ఈసందర్భంగా మంత్రులు జర్నలిస్టు సంఘాలు, సొసైటీ పాలకవర్గ సభ్యులతో మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను త్వరగా అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫోన్ చేశారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాలు కేటాయింపునకు జాప్యం చేయవద్దని సత్వరం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సొసైటీకి సంబంధించి మరో 8ఎకరాల సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందన్నారు. మంత్రులను కలిసిన వారిలో మూడు యూనియన్ల నాయకులు కె.రామనారాయణ, వనం వెంకటేశ్వర్లు, ఆకుతోట ఆదినారాయణ, రాము, సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, పలువురు ప్రముఖ జర్నలిస్టులు పాల్గొన్నారు.







ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు, కుమ్మర సంఘం వన భోజన కార్యక్రమం మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, బంజార వనసమారాధనలో మంత్రి పొంగులేటి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఘనంగా వనసమారాధనలు, ఆయా , కులసంఘాల ఆధ్వర్యంలో వేడుకలు



కూసుమంచిలో ఆర్యవైశ్యుల సామూహిక వ్రతాలు





నేలకొండపల్లిలో కమ్మవారి, దమ్మాయిగూడెంలో ఆర్యవైశ్య వనసమారాధనలో పూజ చేస్తున్న భక్తులు



మాట్లాడుతున్న కమర్తపు మురళి



వనభోజనాల వేదికపై బ్రాహ్మణ నాయకులు

బ్రాహ్మణ వనసమారాధన

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్తంభాద్రి పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సాహంగా బ్రాహ్మణ వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరుకూరివారి తోటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కుటుంబాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 100 ఏళ్లకు పైబడిన వృద్ధురాలు కూడా ఈ వనసమారాధనలో పాల్గొని అందరికీ స్ఫూర్తి నిచ్చారు. ఉదయం వేదమంత్రాలతో మహారుద్రాభిషేకాలు నిర్వహించి ఉసిరి చెట్టుకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పురోహిత కుటుంబాలు సభ్యులతో తోటలో కోలాహలంగా మారింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విశిష్ట సేవలు అందించిన వారిని సత్కరించారు. ఈకార్యక్రమంలో మారుతి వీరభద్రప్రసాద్‌శర్మ, అవధానుల సాయినాథ్‌శర్మ, చివుకుల శ్రీనివాస్‌శర్మ, దుగ్గిరాల సత్యనారాయణ శర్మ, అయితపు శ్రీనివాస్, జీలుగుల సతీష్, ఆమంచి సురేష్‌శర్మ, కొనకంచి ప్రసాద్, మర్తి రామూర్తి, జగన్మోహనరావు, సరస్వతిభట్ల శ్రీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో

కూసుమంచి: కూసుమంచిలోని మామిడితోటలో ఆర్యవైశ్యుల వనసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో మండలంలోని పలుగ్రామాలనుంచి పెద్దసంఖ్యలో ఆర్యవైశ్యులు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని సామూహిక సత్యనారాయస్వామి వ్రతాలు ఆచరించారు. పూజారి ప్రసాద్‌శర్మ వేదమంత్రోచ్ఛారణ నడుమవ్రతాలు నిర్వహించారు. సుమారు 50మంది దంపతులు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. ఉసిరి చెట్టుకింద మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక భోజనాలు చేశారు. అనంతరం ప్రముఖులను సత్కరించారు. మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు వేముల శ్రీను ఆధ్వర్యంలో బూర్లె వేలాద్రి నర్సింహారావు, బోనగిరి రాజేంద్రప్రసాద్, చౌడవరపు కృష్ణారావు, శ్యాంసుందర్, సత్యనారాయణ, కిషోర్, రామకృష్ణ, జనార్ధన్, వంశీ, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో కమ్మసంఘం ఆధ్వర్యంలో..

నేలకొండపల్లి: కార్తీక మాసం చివరి ఆదివారం మండలంలో కమ్మ, కాపు, పద్మశాలీలతో పాటుగా వివిధ కులాలు వేర్వేరుగా వన సమారాధనలు నిర్వహించారు. నేలకొండపల్లి అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడి తోటలో కమ్మవారి ఆత్మీయవన సమారాధన ఘనంగా జరిగింది. మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ పాటలు పాడుతూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. చవళం ప్రవీణ్‌కుమార్, మద్దినేని మహేష్, అక్కినేని నాగేశ్వరరావు, కడియాల నగేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

పద్మశాలీల వన మహోత్సవం

ఆదివారం నేలకొండపల్లి బౌద్ధస్థూపం వద్ద జరిగిన పద్మశాలీల వన సమారాధన నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపుమురళి హాజరయ్యారు.పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో తుమ్మ ఉపేందర్, మోర మల్లయ్య, ఎలిగేటి గిరి పెద్ద సంఖ్యలో పద్మశాలీలు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల ఆధ్వర్యంలో

మున్నూరు కాపుల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఆదివారం ఎస్సీబీసీ కాలనీలోని బాజా పాండురంగయ్య మామిడి తోటలో నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఆట,పాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో బాజా బసవయ్య, కందికొండ శ్రీనివాసరావు, నున్నా రామారావు, తోట భాను తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర వన భోజనాల్లో మంత్రి పొంగులేటి

ఖమ్మంసంక్షేమవిభాగం: ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బల్లేపల్లి మామిడితోటలో మొల్లమాంబ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొని ప్రసంగించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొగిలిచర్ల సైదులు, దరిపల్లి చంద్రశేఖర్, గౌరవఅధ్యక్షులు సిలివేరు జనార్ధన్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో ఆర్యవైశ్యుల

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమంలో తిరుమలాయపాలెం ఎస్‌ఐ జగదీష్ పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు ఐకమత్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి దయాకర్, కనమర్లపూడి శ్రీనివాసరావు, సంకా రత్నాకర్, సంకా భాస్కర్, భువనగిరి రమేష్ సింగవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాసరావు, కనకయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు

బంజార వనభోజనాల్లో మంత్రి, ఎంపీ

ఖమ్మంసంక్షేమ విభాగం: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ అండగా ఉంటుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రఘునాథపాలెం మామిడితోటలో నిర్వహించిన బంజార వనభోజన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సంతుసేవాలాల్‌కు పూజలు చేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ బంజారాలు అంతా ఒకేతాటిపై ఉండాలని పిలుపునిచ్చారు. ఐక్యతను చాటాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి బంజార సంప్రదాయ నృత్యాలు చేశారు. బంజార కమిటీ చైర్మన్ పొరిక రాము, సభ్యులు బానోత్ బాసు, చక్రవర్తి, పాపాలాల్‌నాయక్, మాలోత్ రామారావు, బానోత్ వీరు నాయక్, మాలోత్ రమేశ్, బాలాజీ, వెంకటేశ్వర్లు, మంగీలాల్, బన్సీలాల్, నాగు, జయపాల్, భాగ్యరావ్, సీతారామ్, దేవ్ సింగ్, వీరన్న, మోతిలాల్, కమల్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కేశ్వాపురం వాసుల సమ్మేళనం



కూసుమంచి: కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పలుకుటుంబాలు ఒక దగ్గరికి చేరి తమ కుటుంబాలు, తమ గ్రామానికి అనేక అనుభవాలను పంచుకున్నారు. కేశ్వాపురంలో పుట్టినప్పటికీ హైదరాబాద్‌లో నివసిస్తున్న సుమారు 75 కుటుంబాలు ఒక చోటకి చేరడం విశేషం. హైదరాబాద్‌లో వివిధ రంగాల్లో ఉన్నతులుగా స్థిరపడిన అందరూ ఆదిబట్ల సమీపంలో ఒకచోట చేరి భవిష్యత్తులో సమాజానికి తమ గ్రామఅభివృద్ధికి అనే దానిపై చర్చించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలానే కలిసి ఉంటూ సేవ చేయాలని నిర్ణయించారు.

మిత్రుడి కుటుంబానికి రూ.10వేల సాయం



మిత్రుడి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న తోటి మిత్రులు

కామేపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని అబ్బాసుపురం గ్రామానికి చెందిన దారావత్ కృష్ణప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతనితోపాటు 2006లో పదోతరగతి చదివిన బాల్యమిత్రులు అందరూ కలిసి ఆకుటుంబానికి రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా నాగేంద్రబాబు, కానుగుల సత్యనారాయణ,దారావత్ రాము, లావుడియా వీరభద్రం, దారావత్ విన్నిబాబు, శ్రీరామ్, సతీష్, పందుల వెంకటేశ్వర్లు, గుగులోత్ ఉసేందర్, అంబడిపుడి రాజేష్, బానోత్ రాజశేఖర్, దారావత్ లాలు, రవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలు

ఖమ్మంరూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఖమ్మంరూరల్ మండలం వెంకటగిరి గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ముదిగొండ మండలం, ముదిగొండ గ్రామానికి చెందిన బాణాల రామాచారి ఖమ్మంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజులాగే ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై ముదిగొండ నుంచి ఖమ్మం విధులకు వెళుతున్నాడు. వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో రామాచారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించగా కాలు తొలగించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ రాజు ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేలు అందజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్‌నవంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో సబ్‌జూనియర్స్ విభాగంలో అండర్-08, 10, 12 బాలురు, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 56 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర జట్టుకు వివేక్, భవన్‌తేజ, రోహిత్, అలోక్, జీవన్, క్రిష్ణన్, వరుణ్, సాయిఆదర్శ్ బాలికల జట్టుకు లాస్యశ్రీ, సాత్విక, భవిత, లోహిత, నిత్యశ్రీ, రుతిక, ఉదయశ్రీ, మధుమిత, హస్మిత, ప్రతిభ ఎంపికయ్యారు. వీరు త్వరలో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు.

బెంచ్‌ప్రెస్ పోటీల్లో నగీన ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఇటీవల తమిళనాడులో జరిగిన సౌత్ ఇండియా స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో నగరానికి చెందిన సీహెచ్. నగీనా ప్రతిభ చూపింది. రజత పతకం సాధించింది. 69 కేజీల విభాగంలో స్క్వాడ్, బెంచ్‌ప్రెస్, డెట్‌లిఫ్ట్ విభాగాల్లో మొత్తం 362.5 కేజీల బరువు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచింది.

నేడు న్యాయవాదుల నిరసన

ఖమ్మంలీగల్‌నవంబరు24(ఆంధ్రజ్యోతి): సోమవారం ఖమ్మం కోర్టు ఎదుట నిరసన కార్యక్రమాన్నినిర్వహించనున్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులందరూ ఉదయం 10గంటల నుంచి 10.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

సుబ్లేడు మాజీసర్పంచ్ సంజీవయ్య మృతి



తిరుమలాయపాలెం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు గ్రామమాజీ సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్య (58)ఆదివారం హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన ఈనెల 20న ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్లి తిరిగి సుబ్లేడు వస్తున్నాడు. ఈక్రమంలో తిరుమలాయపాలెం వద్దకు రాగానే ఎదురుగా వెళుతున్న లారీ ఢీకనటంతో బలమైన గాయాలయ్యాయి ఖమ్మంలోని ప్రైవేట ఆసుపత్రిలో చేర్పించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాదు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సంజీవయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. సంజీవయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి సర్పంచ్‌గా పనిచేసిన కాలంలలో సస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాడు. సర్పంచ్‌గా పనిచేసిన కాలంలలో సస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాడు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయ నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మద్దినేని మధు, సుమన్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపాలరావు, కంచం కరుణ నివాళులర్పించారు.

పోలీసుల అదుపులో జూదరులు

ఖమ్మంక్రైం,నవంబరు24(ఆంధ్రజ్యోతి): నగర శివారులో కోడిపందాలు ఆడుతున్న 24 మందిని ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. నగర శివారులోని గోపాలపురం నుంచి గొల్లగూడేనికి వెళ్లే రోడ్డులోని కొబ్బరితోటలో కోడిపందాలు ఆడుతున్నారని సమాచారంతో ఖానాపురంహవేలి ఎస్ఐ రాము సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. 24మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 5 ద్విచక్ర వాహనాలు, ఆటో, సెల్‌ఫోన్లు, కొంత నగదును స్వాధీనం చేసుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహారాష్ట్రవాసి

ఖమ్మంటౌన్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక తిరుగుతున్న వృద్ధుడు అభానాయక్‌ను అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగు నెలల క్రితం ముదిగొండ పోలీసులు అతడిని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. వైద్యం చేయించటంతో కోలుకున్న వ్యక్తి కుటుంబ సభ్యుల వివరాలు చెప్పాడు. వారికి సమాచారం అందించారు. అభానాయక్ కుమారుడు సలీంనాయక్ ఆదివారం ఖమ్మం వచ్చి పోలీసుల సమక్షంలో తండ్రిని తీసుకెళ్లాడు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

బీసీఉపాధ్యాయ సంఘం(బీసీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మంటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీఉపాధ్యాయ సంఘం(బీసీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బీసీటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బీసీఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఐఎంఏ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీటీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్‌లు వీరప్ప, శ్రీకాంత్ నల్గొండ జిల్లా అధ్యక్షుడుశంకర్‌గౌడ్, మేడ్చల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వై.గోపాల కృష్ణ, రాష్ట్ర సలహాదారుల అరుణ, నాగమణి, సంగమేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాదె చెన్నారావు



సత్తుపల్లిరూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి పట్టణ కమిటీ అధ్యక్షుడిగా గాదె చెన్నారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లకు చెన్నారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కష్టపడిన వారికి పదవులు వరిస్తాయని, పార్టీకోసం నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలను అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుదని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెన్నారావు తెలిపారు.

డేటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలి

» ఆర్డీవో రాజేంద్రగౌడ్



సూచనలు ఇస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

వేంసూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్ అన్నారు. ఆదివారం వేంసూరు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా సమర్థవంతంగా డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ.రాజు, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీవో రంజిత్, ఆర్ఐలు శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధితో
రూ.30లక్షల పైపులైన్ల భారం

» నూతన పైప్‌లైన్లు త్వరగా వేసి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని స్థానికుల వినతి

వైరా, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు అభివృద్ధి పనుల దృష్ట్యా దాదాపు రూ.30లక్షల మేర తాగునీటి పైపలైన్లు తొలగించాల్సి ఉంది. మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌తోపాటు మునిసిపాలిటీకి చెందిన ఇంట్రా పైపులైన్లను తొలగించి రోడ్డు పనులు చేయాల్సి ఉంది. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి రూ.12కోట్లతో 1.8కిలోమీటర్ల మధిర-జగ్గయ్యపేట రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా నిర్మించే పనులు జరుగుతున్నాయి. నాలుగు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నందున ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల బీటీ రోడ్డుకు రెండువైపులా వేసిన పైపులైన్లను విధిగా మార్చాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ నుంచి మంచినీటి సరఫరా చేసే 30డయాకు చెందిన డీఐ ప్రధాన పైపులైన్‌ను దాదాపు 200మీటర్ల మేర తొలగించి రోడ్డు అంచులో కొత్తగా నిర్మించాల్సి ఉంది. ప్రధాన పైపులైన్ ద్వారా పాలడుగు వరకు దాదాపు 20గ్రామాలకు మిషన్ భగీరథ మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పైపులైన్ తొలగించే సమయంలో వారాల తరబడి మంచినీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంది. అంతేకాకుండా లక్షలాది రూపాయల నిధులను కూడా వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది.

ఇదిలా ఉంటే క్రాస్ రోడ్డు నుంచి బీటీకి రెండు వైపులా 140డయా, 110డయాకు చెందిన హెచ్‌డీపీ పైపులైన్ల ద్వారా 5,6,9వార్డుల్లోని దాదాపు 800ఇళ్లకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు ఈ పైపులైన్లు రోడ్డుకు ఒకవైపు 1200మీటర్లు, రోడ్డుకు రెండోవైపు 1400మీటర్ల మేర తొలగించాల్సి ఉంది. రోడ్డుకు రెండువైపులా ఈ పైపులైన్ల పైనుంచే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పుడున్న పైపులైన్లను డమ్మీ చేసి రెండువైపులా కొత్త పైపులైన్లు నిర్మించేందుకు కూడా లక్షలాదిరూపాయల నిధులు అవసరముంది. అయితే ఇంతవరకు ఆదిశగా చర్యలు చేపట్టలేదు. రోడ్డుకు రెండువైపులా ఇప్పటికే మట్టి పోసి చదును చేస్తున్నారు. అడుగుభాగంలోనే ఈ పైపులైన్లు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్న పైపులైన్లను తొలగించకుండా కొత్త పైపలైన్లు నిర్మించకుండా రోడ్డు పనులు చేస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తంగా రూ.30లక్షల నిధులు అవసరముంది. ఈ నిధుల భారాన్ని మిషన్ భగీరథ అధికారులు భరిస్తారా...? లేక ఆర్అండ్‌బీ, మునిసిపల్‌శాఖలోనుంచి నిధులను కేటాయిస్తారా? అనే దానిపై స్పష్టత కొరవడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు అభివృద్ధి పనుల్లో దెబ్బతిన్న పైపులైన్

జన భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

» మునిసిపల్ చైర్మన్ జైపాల్

వైరా నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు సంఘం ఆత్మీయ సమ్మేళనంలో కుల భోజనాలు కాకుండా జన భోజనాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ పేర్కొన్నారు. వైరాలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయసమ్మేళం నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. సంఘం నాయకులు షేక్‌పాషా, డేవిడ్‌రాజు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు కట్ల రంగారరావు, లగడపాటి ప్రభాకర్‌రావు, యామాల గోపాలరావు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, శ్యామ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి'

వైరా నవంబరు 24 (ఆంధ్యజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం (టీయూఎఫ్) సమావేశం డిమాండ్ చేసింది. ఈ నెల 27 తేదీన పసుపులేటి నాసరయ్య ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి వేములవాడ వరకు నిర్వహించే ఉద్యమకారుల పాదయాత్రను జయప్రదం చేయాలని కోరింది. మాదినేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో దొంత నరసింహారావు, కన్నెగంటి ఉస్సేన్, భూక్యా వెంకన్న, కన్నెగంటి వెంకటేశ్వర్లు, చింతపల్లి జయరాజు, ఉస్సేన్, బొచ్చురమణ, శ్యామ్‌కుమార్, గోపాలరావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

» ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రమణ

కొణిజర్ల, నవంబరు24(ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో పాలకులు మారుతున్న మహిళలపై మాత్రం హింస, అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని, వాటిని అరికట్టడంలో పాలకులు విఫలం అవుతున్నారని ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ విమర్శించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిన్నగోపతి గ్రామంలో కూరెల్లి సరోజ అధ్యక్షతన మహిళపై హింసకు వ్యతిరేక సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ దేశంలో ప్రతి రోజు ఏదోఒకరూపంలో మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. మహిళలపై అత్యాచారాలకు హింసకు మూల కారణమైన మద్యం, డ్రగ్స్, మత్తు పానియాలను, పబ్బులను నియంత్రించడంలో పాలకులకు చిత్తశుద్ధిలేదని ఆమె విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనుధర్మ శాస్త్రాన్ని ఆచరణలోకి తేవాలని చూస్తుందని, మహిళలు వంట ఇంటికే పరిమితంకావాలని చూస్తున్నారని అన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు తాళ్ళపల్లి విజయ, తాతా పద్మా, కుమారి, మునెమ్మ, రాణి, అనిత, రత్నం, స్వరూప, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ



వీరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చింతకాని, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు వీరయ్య ఇటీవల మృతి చెందడంతో ఆదివారం నాగులవంచ గ్రామంలో అంబటి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ప్రసాద్‌రెడ్డి, కిలారు మనోహర్‌బాబు, కన్నెబోయిన సీతరామయ్య, మండదపు శ్రీను, నారపోగు కొండల్ రావు తదితరులు పాల్గొన్నారు.

మధిర రూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఆత్కూరు గ్రామంలో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఆత్కూరులో పేద కుటుంబానికి చెందిన అంకె వేలాద్రి బెయిన్ సర్జరీ చేయించుకొని అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వేలాద్రి ఇంటికి వెళ్లి పొంగులేటి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.20వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, కటికల సీతరామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంఘం సభ్యుడిగా భద్రయ్య ఎన్నిక



మధిర కోర్టు ఏపీపీ భద్రయ్యను అభినందిస్తున్న దృశ్యం

మధిర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా మధిర కోర్టు ఏపీపీ జన్ను భద్రయ్య ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఈమేరకు ఆయన ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బీ. కృష్ణమోహన్, సహచర ప్రాసిక్యూటర్స్, పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎఫ్‌సీఐ కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలి

» డీఆర్‌డీవో సన్యాసయ్య



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సన్యాసయ్య

కల్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్రాలకు వచ్చిన నిబంధనల ప్రకారం ఎఫ్‌సీఐ కేంద్రాలకు తరలించాలని డీఆర్‌డీవో సన్యాసయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుల్లయ్యబంజరు, లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత లేకుండ చూస్తామన్నారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా ఎంత ఉందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లులకు తరలించిన రైతుల ధాన్యానికి సంబంధించి వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని సమైఖ్య సభ్యులను ఆదేశించారు. కేంద్రాల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం దర్గయ్య, ఏపీఎం వెంకటా రామారావు, గ్రామ సమైఖ్య సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ వద్దిరాజు పరామర్శ

కొణిజర్ల, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుగునమ్మ చిత్రపటానికి ఆదివారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వద్దిరాజుకు రామారావు మిత్రుడు కావడం, మృతురాలికి రామారావు అల్లుడుకావడంతో ఎంపీ పరామర్శకు వచ్చారు. ఈ కార్యక్రమంలో గుబ్బగుర్తి బీఆర్ఎస్ అధ్యక్షుడు తాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు రోషన్‌బేగ్, కృష్ణ, యాలాద్రి, డానియేలు, వెంకట్రావు, సామేల్, ప్రసాద్ తదితరులున్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

మధిరటౌన్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): మధిరలో అక్రమంగా ఇ సుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ఎస్ఐ సంధ్య యడ్లబండ్ల యజమానులను హెచ్చరించారు. ఆదివారం రాత్రి ఆమె యడ్లబండ్ల యజమానులకు కౌన్సిలింగ్ చేసారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా ఉండేందుకు ర్యాంపుల్లోకి దిగకుండా కందకాలు తీసినా వాటిని పూడ్చి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మరోసారి అలా చేస్తే తహసీల్దార్ ముందు బైండోవర్ చేసి లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.



ఇసుక రవాణా చేస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సంధ్య

సేవా ఆశ్రమానికి ఆర్ఎఫ్ఎస్ చేయూత

సత్తుపల్లిరూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దారం రోడ్‌లో స్వర్ణిక ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల సేవా ఆశ్రమానికి ఆర్ఎఫ్ఎస్ ఫౌండేషన్ నిర్వహకులు రవి చేయూతనందించారు. ఆదివారం ట్రస్ట్‌ను సందర్శించి ఆశ్రమానికి కావాల్సిన వంట సామానులను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా ఆశ్రమం నిర్వహకులు వలపర్ల అనిల్‌కుమార్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. కల్లూరు లో ఆదివారం కార్యదర్శి దమాల దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తియినందున సభ్యత్వ నమోదు చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు ప్రజా, కార్మికుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు గాదే లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, వేము రాంబాబు, నిమ్మాటూరి రామకృష్ణ, పిల్లి బాస్కర్, రాజశేఖర్, మల్లేష్, పాగ సత్యవతి, మల్లికా, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ప్రసాద్

వైభవంగా అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం



ఇరుముడితో శబరిమలై వెళ్తున్న అయ్యప్పలు

మధిర, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మధిరలోని అయ్యప్పస్వామి దేవాలయం ఆదివారం అయ్యప్పల శరణుగోషతో మారుమోగింది. 41రోజులు దీక్ష పూర్తిచేసుకొన్న అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్పలు వారి బంధువులతో ఆలయం ప్రాంగణం కోలాహలంగా మారింది. ఇరుముడి కార్యక్రమం పూర్తి చేసుకొని చెరుపల్లి శ్రీధర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పలు పట్టణంలో భారీ ప్రదర్శనగా రైల్వే స్టేషన్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు గురుస్వాములు, అయ్యప్పలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మధిర నుంచి విజయవాడకు బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

మధిర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మధిర నుంచి దెందుకూరు, చిలుకూరు మీదుగా విజయవాడకు ఆర్టీసీ బస్సు సర్వీసును అధికారులు ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 8.30గంటలకు మధిర బస్టాండులో బయలుదేరి దెందుకూరు, చిలుకూరు, వెల్లంకి, పొన్నవరం, కంచికచర్ల మీదుగా విజయవాడకు ఉదయం 10.15గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 6.30 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 8.15గంటలకు మధిరకు చేరుకుటుందని డిపో మేనేజర్ శంకర్‌రావు తెలిపారు. ప్రయాణికులు ఈ సదుపాయం వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

వనంలో జనజాతర



రెడ్డి సంఘం వనసమారాధనలో మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న దృశ్యం

మధిర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస వనసమారాధన కార్యక్రమాలను ఆదివారం మధిరలో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఆయా సంఘాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాలకు హాజరై వనసమారాధనలో పాల్గొన్నారు.



తల్లాడలో నృత్యం చేస్తున్న యువతులు

కమ్మజన సంఘం ఆధ్వర్యంలో...

మండలం కృష్ణాపురం బొప్పనవారి మామిడితోటలో కాకతీయ కమ్మసంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనసమారాధన జరిగింది. కార్యక్రమంలో కమ్మసంఘం నేతలు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కరివేద వెంకటేశ్వరరావు, చావా రామకృష్ణ, బీవీఆర్, గడ్డం రమేష్, కొంగర మురళీ, కాకాని శ్రీనివాసరావు, చెరుకూరి కృష్ణారావు, మల్లాది వాసు, చెరుకూరి నాగార్జున్, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.



కమ్మసంఘం వనసమారాధనలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

రెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో మధిర శివారులోని ఆత్కూరు మామిడితోటలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలు హాజరయ్యారు. కార్యక్రమంలో శీలం వెంకటరెడ్డి, టీవీ.రెడ్డి, జేవీ.రెడ్డి, అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, కటికల సీతరామిరెడ్డి పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో...

మధిర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం ఆత్కూరులోని అబ్బూరి రామకృష్ణ మామిడితోటలో ఘనంగా జరిగింది. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ఖమ్మం ఆర్జేసీ విద్యాసంస్థల అధినేత కృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్నూరుకాపుసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు బూసా కోటేశ్వరరావు, కొఠారి రాఘవరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, రంగారావు, శ్రీపాలశెట్టి వెంకట్రావ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ జడ్పీటీసీ సూరంశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో కాపు సంఘం వన మహోత్సవం

ఏన్కూరు నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులుఐక్యతచాటాలని ఆసంఘం నాయకులు సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరావు అన్నారు. ఆదివారం ఏన్కూరులో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు పిన్ని వెంకటనారాయణ, కొవ్వూరి నాగేశ్వరరావు, ఆవుల నరసయ్య, ముదిగొండ నాగేశ్వరరావు,శెట్టిపల్లి నరేష్, మోరంపల్లి ఎంటీరావు, నరేంద్రబాబు, వరశంకరప్రసాద్,



కాపుసంఘం వనసమారాధనలో ఉదయభానును సన్మానిస్తున్న దృశ్యం



సత్తుపల్లి: గౌడసంఘం వనసమారాధనలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కనిశెట్టి వెంకన్న, ఆది వెంకటేశ్వర్లు, తదితరులుపాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఘనంగా కార్తీక వనసమారాధనలు

సత్తుపల్లిరూరల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి పట్టణంలో ఆదివారం మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాణీ గురుకులం, పట్టణ గౌడసంఘం ఆధ్వర్యంలో కందిమళ్ల కృష్ణారావు మామిడితోటలో కౌండన్య కార్తీక వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌లు మాట్లాడుతూ ఐకమత్యానికి ప్రతీకలుగా కార్తీక వనసమారాధన నిలుస్తాయని అన్నారు.

గౌడ వారి వనసమారాధన

వైరా నంవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం గౌడ వారి వనసమారాధనను జరుపుకున్నారు. మిట్టపల్లి వారి మామిడితోటలో ఈ వనసమారాధన మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

తల్లాడలో వనసమారాధనలు

తల్లాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో ఆదివారం ఆర్యవైశ్య, మున్నూరుకాపు, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమాలు జరిగాయి.



వైరా వనసమారాధనలో పాల్గొన్న గౌడ జనులు